## క్లుప్తంగా

### ఆశాజనకంగా కంది పంట



కమ్మూరు వద్ద పూతతో ఉన్న కంది పంట

**కూడేరు:** మండలంలో ఖరీఫ్‌లో సాగు చేసిన కంది పంట ఆశాజనకంగా కనిపిస్తోంది. గొటుకూరు, బ్రాహ్మణపల్లి, కూడేరు, కలగళ్ల, మరుట్ల, ఇప్పేరు, ఉదిరిపికొండ, కరుట్లపల్లి, అరవకూరు, చోళసముద్రం, జల్లిపల్లి, కమ్మూరు, పి.నారాయణపురం, జయపురం, కొర్రకోడు గ్రామాల్లో వర్షాధారం కింద సుమారు 11,000 ఎకరాల విస్తీర్ణంలో కంది పంట సాగు చేశారు. ప్రస్తుతం పూతదశకు వచ్చింది. పూత బాగా పూస్తే దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### ముగిసిన ఓటరు నమోదు



పోలింగ్ బూత్‌లో క్లెయిమ్‌లను పరిశీలిస్తున్న ఈడీటీ సుజాత

**రాయదుర్గంటౌన్:** రెండు రోజుల పాటు చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. నియోజకవర్గంలోని రాయ దుర్గం అర్బన్, రూరల్, గుమ్మఘట్ట, డి.హీరేహాళ్, కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లోని 296 పోలింగ్ బూత్‌లలో ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కోసం బీఎల్ఓలు దరఖాస్తులు స్వీకరించారు. తొలి రోజు శనివారం 135 క్లయిమ్‌లను స్వీకరించగా, రెండో రోజు ఆదివారం 183 క్లయిమ్‌లను స్వీకరించినట్లు ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సుజాత తెలిపారు. ఓటరు నమోదు కార్యక్రమానికి ఆయా మండలాల తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈడీటీ సుజాత మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగిన ప్రత్యేక ఓటరు నమోదులో మొత్తం క్లయిమ్‌లు 318 స్వీకరించగా, వీటిలో కొత్త ఓటరు నమోదుకు 160 క్లయిమ్‌లు, తొలగింపునకు 60, సవరణలకు 71, మార్పులకు 37 క్లయిమ్‌లు స్వీకరించినట్లు తెలిపారు.

### కవి సమ్మేళనంలో 'దుర్గం' విద్యార్థికి సత్కారం



సాయి కిశోర్‌ను జ్ఞాపికతో సత్కరిస్తున్న లేపాక్షి ఫౌండేషన్ కమిటీ సభ్యులు

**రాయదుర్గంటౌన్:** జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో జరిగిన అనంత కవితోత్సవం జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో లేపాక్షి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాయదుర్గానికి చెందిన యువ కవి గిద్దలూరు సాయి కిశోర్‌ను ఆదివారం సన్మానించారు. లేపాక్షి ఫౌండేషన్ అధ్యక్షుడు వడ్డీ సుధాకర్, పొట్లూరి హరికృష్ణ చేతుల మీదుగా సాయి కిశోర్ జ్ఞాపికను అందుకుని, సత్కారం పొందాడు.

### ఆగిన లారీని ఢీకొన్న ద్విచక్ర వాహనం

**కూడేరు:** మండలంలోని ముద్దలాపురం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు రంగనాయకులు గాయపడ్డాడు. అనంతపురం – బళ్లారి ప్రధాన రహదారి పక్కన నిలిపి ఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. గాయపడిన అతను కూడేరు ఆస్పత్రిలో చికిత్స పొందాడు.

### భారీగా తగ్గిన పూల ధరలు

**కుందుర్పి:** నియోజకవర్గ వ్యాప్తంగా బంతి పూల ధరలు తగ్గుముఖం పట్టాయి. బహిరంగ మార్కెట్‌లో ముద్ద బంతి పూలు కిలో రూ.10లోపు పలుకుతున్నాయి. బంతి పూలు సాగు చేయాలంటే ఎకరాకు రూ.50 వేలు నుంచి రూ. 60 వేలు పెట్టుబడి అవుతుంది. పూల ధరలు పడిపోవడంతో కనీసం పెట్టుబడి కూడా అందక రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. పక్షం రో జులుగా కిలో బంతి పూలు రూ.6 నుంచి రూ. 8 వరకు పలికేది. ప్రస్తుతం 50 కిలోల బస్తా పూలు రూ.110 పలుకుతోందని రైతులు నాగభూషణ, సత్యానంద, రామప్ప తదితరులు తెలిపారు.

### డిసెంబర్ 10న చలో విజయవాడ



పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

**రాయదుర్గంటౌన్:** సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని కోరుతూ డిసెంబర్ 10న చలో విజయవాడ కార్యక్రమం ఉంటుందని ఏపీ సీపీఎస్‌ఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రేమనాథరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో చలో విజయవాడ పోస్టర్లను సీపీఎస్ ఉద్యోగులు విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు జిలాన్, నాగరాజు, మల్లికార్జున, చెన్నకేశవ, రజనీకుమార్, వెంకటరమణ, హరి, మంజునాథ పాల్గొన్నారు.

# అధ్వాన రోడ్లు.. అగచాట్ల ప్రయాణం

- నియోజకవర్గంలో దెబ్బతిన్న గ్రామీణ రోడ్లు
- కంకర తేలి, గుంతలుపడి రహదారులు
- రాకపోకలు సాగించాలంటే బేజారవుతున్న ప్రజలు



వజ్రకరూరు మండలంలో కడమలకుంటకు వెళ్లే రోడ్డు రాళ్లు, కంకరతేలిన దృశ్యం



గుంతలు పడిన ఛాయాపురం రహదారి

**వజ్రకరూరు:** పల్లె వాతావరణం నచ్చని వారంటూ ఎవరూ ఉండరు.. రోడ్లు.. ఇరువైపులా పెద్ద చెట్లు..చుట్టూ చెట్లూ..చేమలు. కొండలు, గుట్టలు. ఎటుచూసినా పచ్చని పైర్లు.. ప్రయాణం చేస్తుంటే.. ఆహా అని మైమరిపించేలా ఉంటుందని అనుకుంటారు. ఉరవకొండలో అందుకు భిన్నంగా ఉంటుంది. పల్లెలకు వెళ్లాలంటే నరకంలా అనిపిస్తుంది. స్వయానా మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గంలో ప్రగతికి చిహ్నాలుగా ఉండాల్సిన రోడ్లు.. అతుకుల గతుకులు, ఆగమ్యగోచరంగా ఉండడంతో ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోంది. ఉరవకొండ నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉండగా 88 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వజ్రకరూరు మండలంలో 19 పంచాయతీలు, ఉరవకొండ మండలంలో 18 పంచాయతీలు, బెళుగుప్ప మండలంలో 19 పంచాయతీలు, విడపనకల్లు మండలంలో 18 పంచాయతీలు, కూడేరు మండలంలో 14 పంచాయతీలు ఉన్నాయి. వజ్రకరూరు మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రహదారులు పూర్తిగా దెబ్బ తిని రాళ్లు తేలడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వజ్రకరూరు మండలం కొనకొండ్ల నుంచి ఛాయాపురానికి వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిని రాళ్లతేలి, గుంతలు పడింది. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉందని ప్రజలు వాపోతున్నారు. గుంతకల్లు – ఉరవకొండ మెయిన్‌రోడ్డు నుంచి కొత్తకడమల కుంట, పాత కడమలకుంట గ్రామాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. రాళ్లతేలడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తట్రకల్లు నుంచి ఎస్ఎస్‌పీ తండాకు వెళ్లే రోడ్లులోనూ అక్కడక్కడ రాళ్లుతేలి గుంతలు పడ్డాయి. కమలపాడు బస్టాప్ నుంచి కమలపాడు గ్రామానికి వెళ్లే రహదారికూడ దెబ్బతినడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**లత్తవరం వెళ్లాలంటే నరకమే..**

ఉరవకొండ మండలంలో ఉరవకొండ నుంచి లత్తవరం వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతినడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఉరవకొండ నుంచి వ్యాసాపురం వెళ్లే రహదారి కూడా దెబ్బతినడంతో ప్రజల రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. విడపనకల్లు మండలంలో ఉరవకొండ నుంచి పాల్తూరుకు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతినింది. పాల్తూరు నుంచి కరకముక్కలకు వెళ్లే రహదారి కూడా పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేల్పుమడుగు నుంచి విడపనకల్లు వెళ్లే రహదారి కూడా అధ్వానంగా మారడంతో రాకపోకలకు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వి.కొత్తకోట నుంచి విడపనకల్లుకు వెళ్లే రహదారి కూడా అధ్వానంగా మారడంతో ప్రజలు రాకపోకలకు నానాపాట్లు పడు తున్నారు. ఉరవకొండ నుంచి విడపనకల్లు మండలం చీకలగురికి వెళ్లే రహదారికూడా దెబ్బతినడంతో ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.

**గతుకుల రోడ్లు..గమ్యం ఆగమ్యగోచరం**

బెళుగుప్ప మండలంలో వెంకటాద్రిపల్లి నుంచి విరుపాపల్లికి వెళ్లే రహదారి దెబ్బతినడంతో రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. బెళుగుప్ప–కళ్యాణదుర్గం మెయిన్‌రోడ్డు నుంచి ఆవులెన్నె గ్రామానికి వెళ్లే రహదారి కూడా దెబ్బతిని రాళ్లు తేలడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూడేరు మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు దెబ్బతినడంతో రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. పై ఐదు మండలాల్లో గ్రామాలకు వెళ్లే రోడ్లు దెబ్బతినడంతో ప్రజలు,వాహనదారులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ పెద్దలు, అధికారులు స్పందించి దెబ్బతిన్న రహదారుల స్థానంలో నూతన రోడ్లను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

#### రాకపోకలకు అవస్థలు



వజ్రకరూరు మండలం కొనకొండ్లనుంచి ఛాయాపురం వరకు ప్రధాన రహదారి దెబ్బతిని రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రధాన రహదారిలో రాళ్లు తేలి గుంతలు ఏర్పడ్డాయి. రాత్రివేళలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. అధికారులు వెంటనే స్పందించి నూతన రోడ్డు నిర్మించాలి.

– డి.రమేష్, ఛాయాపురం వజ్రకరూరు మండలం

#### రోడ్డంతా గులకరాళ్లు తేలింది



ఉరవకొండ–గుంతకల్లు మెయిన్‌రోడ్డు నుంచి కొత్త కడమలకుంట, పాతకడమల కుంట గ్రామాలకు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతింది. రాళ్లు,కంకర తేలి రోడ్డు అధ్వానంగా మారింది. రాకపోకలకు తీవ్రఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి నూతన రోడ్డును నిర్మించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– సద్దలసుంకప్ప, పాతకడమలకుంట గ్రామం, వజ్రకరూరు మండలం

#### బీటీ రోడ్లకు ప్రతిపాదనలు పంపాం



వజ్రకరూరు మండలంలో గ్రామాలకు వెళ్లే రోడ్లు దెబ్బతిన్న వాటి స్థానంలో నూతన బీటీ రోడ్ల నిర్మాణానికి ఇదివరకు ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే ప్రతిపాదనలు రెన్యూవల్ అయ్యి మంజూరవుతాయి. బీటీ రోడ్లు మంజూరయిన వెంటనే పనులు ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– మణిభూషణ్, పీఆర్ ఇంజనీరు, వజ్రకరూరు మండలం

## ఐదు నెలలకే ఐదింతల వ్యతిరేకత



మాట్లాడుతున్న మెట్టు గోవిందరెడ్డి

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి



హాజరైన వివిధ గ్రామాల కార్యకర్తలు, పార్టీ నాయకులు

**రాయదుర్గం:** 'కూటమి ప్రభుత్వంపై ఐదు నెలలకే ఐదింతల వ్యతిరేకత వచ్చింది. అభివృద్ధి, సంక్షేమం దేవుడెరుగు..దౌర్జన్యాలు, హత్యలు, అక్రమకేసులు, అరాచకాలు అధికమయ్యాయి..దేశంలో ఎక్కడా లేని విధంగా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలులోకి తీసుకొచ్చారు.. ప్రతిపక్షాన్ని అణచివేసే ధోరణిని అవలంబిస్తున్నారు.. వీటన్నింటినీ ప్రజలు గమనించి ప్రజా తిరుగుబాటుకు సిద్ధమయ్యారు' అని వైఎస్సార్‌సీపీ రాయదుర్గం సమన్వయకర్త మెట్టుగోవిందరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని తన నివాసంలో డి హీరేహాళ్ మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్టు మాట్లాడారు. సూపర్‌సిక్స్ హామీలు నమ్మి ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఓట్లేస్తే, అధికారంలోకొచ్చాక వాటి అమలు తీరు అధ్వానంగా ఉందన్నారు. పెన్షన్ పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, రైతుకు పెట్టుబడి సాయంపై ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయన్నారు.

**కార్యకర్తలను కాపాడుకుంటాం**

నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా అండగా నిలుస్తామని మెట్టు గోవిందరెడ్డి భరోసా ఇచ్చారు. అక్రమ కేసులు, దౌర్జన్యాలు, దాడులకు పాల్పడితే ఇక మీదట భయపడేది లేదని హెచ్చరించారు. కొన్నిచోట్ల అధికార పార్టీ నేతలకు తలొగ్గి పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని అన్నారు. ఇలాంటివి ఎన్నో ఏళ్లు సాగవన్నారు. గిరిజన మహిళలపై కేసులు నమోదు చేసి జైలుకు పంపడం సరికాదని, సోషల్ మీడియాలో ఎప్పుడో మూడేళ్ల క్రితం పెట్టిన పోస్టులను బయటకు తీసి వేధింపులకు గురి చేస్తున్నారని, ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని, లేదంటే పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాలు, ప్రతిపక్షాలతో కలసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

**కొత్తవారికి అవకాశమివ్వాలనే ఉద్దేశంతో...**

పార్టీ ప్రారంభం నుంచి కొందరు కన్వీనర్ స్థానాల్లో కొనసాగుతున్నారని, కొత్తవారికి అవకాశమివ్వాలనే ఉద్దేశంతో స్వచ్ఛందంగా తప్పుకుంటున్నారని మెట్టు అన్నారు. అలాంటి చోట పార్టీ పగ్గాలు అప్పగించే బాధ్యత అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఆశావహులు ఎక్కువ మంది తెరమీదికి వస్తున్నారని, వారందరి పేర్లు జిల్లా అధ్యక్షుడి ఆధ్వర్యంలో రాష్ట్ర పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ముఖ్యంగా పార్టీ పటిష్టం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జమిలీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా సాధారణ ఎన్నికల్లో మనదే విజయమన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లు పేదల అభివృద్ధి, సంక్షేమం కోసం లెక్కలేనన్ని పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు కనిపించలేదన్నారు. కార్యక్రమంలో కణేకల్లు మాజీ ఎంపీపీ గరుడచేడు రాజగోపాల్‌రెడ్డి, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ భోజరాజ్‌నాయక్, నాయకులు సోములాపురం సుదర్శన రెడ్డి, గొడిశెలపల్లి రవీంద్రానాథ్‌రెడ్డి, తొండె వెంకటేశులు, మైనార్టీ నాయకుడు రహంతుల్లా, సందీప్‌పాటిల్, రాయదుర్గం కోఆప్షన్ సభ్యుడు దిలవర్ బాష, మురడి మురళి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం

- మాజీ ఎంపీ తలారి రంగయ్య



బుడిమేపల్లి ఇస్మాయిల్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

**బ్రహ్మసముద్రం:** ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య భరోసా కల్పించారు. అనారోగ్యంతో బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొంది ఇళ్లకు చేరుకున్న వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం నాయకుడు బుడిమేపల్లి ఇస్మాయిల్, గుడిపల్లికి చెందిన శివన్నను మాజీ ఎంపీ తలారి రంగయ్య ఆదివారం పరామర్శించారు. అనంతరం రంగయ్య మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్ , ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి, కంబదూరు ఎంపీపీ భీమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహులు, వేపులపర్తి మంజునాథ, పిల్లలపల్లి అంజి, జానీ పాల్గొన్నారు.

## ఖబరస్థాన్ వద్ద అసాంఘిక కార్యకలాపాలు



ఖబరస్థాన్ వద్ద పడి ఉన్న టెట్రా ప్యాకెట్లు, నీళ్ల ప్యాకెట్లు, ముందు సీసాలు

**రాయదుర్గంటౌన్:** స్థానికంగా ఉన్న ఖబరస్థాన్‌ను మందుబాబులు స్థావరంగా మార్చుకున్నారు. పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఈద్గా వద్ద గల ఖబరస్థాన్‌లో మద్యం టెట్రా ప్యాకెట్లు, నీటి ప్యాకెట్లు, గ్లాసులు దర్శనమిస్తున్నాయి. గ్రూపులుగా మద్యం సేవిస్తూ, అక్కడే సీసాలు, మద్యం ప్యాకెట్లు పడేస్తున్నారు. ఖబరస్థాన్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకునేలా పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఖబరస్థాన్ కమిటీ నిర్వాహకులు ఖాజీ సైఫుల్లా, అబ్దుల్ మజీద్‌సాబ్ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు





తీవ్రంగా గాయపడిన యువకులు ముషీర్, చోటు

**బెళుగుప్ప:** మండలంలోని కాలువపల్లి గ్రామం వద్ద ద్విచక్ర వాహనం ఢీకొని పెన్నానది వంతెన గోడను ఢీకొని ఆదివారం ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు..అనంతపురానికి చెందిన ముషీర్, చోటు గోళ్ల గ్రామం వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. వీరు వెళ్తున్న స్పోర్ట్స్ బైక్ నుజ్జునుజ్జయ్యింది. ఘటనా స్థలానికి సమీపంలోనే ఎస్ఐ శివ వాహన తనిఖీలు చేస్తుండగా విషయం తెలుసుకొని ఘటనాస్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


### ముమ్మరంగా వాహనాల తనిఖీలు



రాయదుర్గంలో వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ జయనాయక్

**రాయదుర్గం:** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రాయదుర్గం ప్రాంతాల్లో ఆదివారం విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు.రాయదుర్గం ప్రాంతంలో సీఐ జయనాయక్ తనిఖీలు నిర్వహించి కౌన్సెలింగ్ ఇచ్చారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటోలను నిలిపి డ్రైవర్లు, ప్రయాణికులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. రికార్డులు లేని, పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటోలు, ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. రూల్స్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. నిత్యం వాహనాల తనిఖీలు చేపడతామని తెలిపారు.

## ఘనంగా కనకదాస జయంతి



కనకదాస చిత్ర పటం వద్ద పూజలు నిర్వహించిన దృశ్యం

**బ్రహ్మసముద్రం:** మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో కనకదాస జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కనకదాస చిత్ర పటాన్ని పూలతో అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

**కణేకల్లు:** కణేకల్లులో ఆదివారం కనకదాస జయంతి వేడుకలను కురుబలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక చిక్కణ్ణేశ్వరస్వామి ఆలయం నుంచి దిగువ వీధి వరకు కనకదాస చిత్రపటాన్ని ఊరేగించారు.

**నేమకల్లులో కనకదాసు జయంతి**

**బొమ్మనహాళ్:** నేమకల్లు గ్రామంలో ఆదివారం కనకదాస జయంతి వేడుకలు ఘనంగా జరిపారు. కనకదాసు చిత్రపటాన్ని ట్రాక్టరులో ఉంచి, 101 కలశాలను చిన్నారులతో కలిసి గ్రామ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో కురుబ సంఘం మండల అధ్యక్షుడు నాగరాజు, సర్పంచ్ పరమేశ్వర, బెల్లి హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





కణేకల్లులో కనకదాస చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం, బొమ్మనహాళ్‌లో కలశాలను ఊరేగిస్తున్న దృశ్యం

### రేపు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా

**కళ్యాణదుర్గం రూరల్:** కేంద్ర ప్రభుత్వం రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 26 ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై దేశ వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేస్తున్నట్లు తెలిపారు.

### విద్యార్థులు ఇష్టపడి చదవాలి



విద్యార్థులకు దుప్పట్లు అందిస్తున్న సర్పంచు మల్లెల జగదీష్

**వజ్రకరూరు:** విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత లక్ష్యం చేరుకోవాలని సర్పంచు మల్లెల జగదీష్ సూచించారు. ఆదివారం మండలంలోని చాబాల గ్రామంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం సర్పంచు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న దుప్పట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హాస్టల్ వార్డెన్ ధనుంజయ, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### శుభకార్యం



గొల్ల కృష్ణప్ప కుమారుడు గొల్ల నరసింహులు వివాహ వేడుకలో పాల్గొన్న రంగయ్య

**కళ్యాణదుర్గం రూరల్:** పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కృష్ణప్ప కుమారుడు గొల్ల నరసింహులు వివాహ వేడుక స్థానిక కురుబ కల్యాణ మంటపంలో ఆదివారం జరిగింది. ఈ వివాహ వేడుకకు మాజీ ఎంపీ తలారి రంగయ్య హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు. కుందుర్పి మండలంలోని ఎనుములదొడ్డికి చెందిన వన్నూరుస్వామి కుమార్తె స్వరూప, రవితేజ వివాహ వేడుకలోనూ ఆయన పాల్గొన్నారు. అనంతరం అదే గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆంజనేయులు కూతురు శ్రావణి సీమంతం వేడుకలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బోయ తిప్పేస్వామి, బ్రహ్మసముద్రం ఎంపీపీ చంద్రశేఖర్, కుందిర్పి ఎంపీపీ కమల నాగరాజు, పాలవెంకటాపురం సర్పంచ్ నరసింహప్ప, బెస్తరపల్లి సర్పంచ్ హనుమంతరాయుడు, జంబుగుంపుల సర్పంచ్ గంగాధర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు చామలూరు రాజగోపాల్, ఎంపీటీసీ ఓనాథ్, మాజీ జెడ్పీటీసీ రాజ్‌గోపాల్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ లింగప్ప, మాజీ సర్పంచ్ తిప్పేస్వామి, జేసీఎస్ మండల కన్వీనర్ రాము, గోళ్ల సూరి, బోరంపల్లి రామిరెడ్డి, లాయర్ హనుమంతురెడ్డి, తిమ్మగానిపల్లి రామాంజనేయులు, విజయ్, భీమేష్ పాల్గొన్నారు.

### బైక్ అదుపు తప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు





తీవ్రంగా గాయపడిన గోవిందు, సిద్ధలింగ

**రాయదుర్గంటౌన్:** పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక శనీశ్వరాలయం వద్ద నివాసముంటున్న సిద్ధలింగ, రైల్వేస్టేషన్ వద్ద నివాసం ఉంటున్న గోవిందు బీటీపీకి వెళ్లి తిరిగి వస్తుండగా గుమ్మఘట్ట మండలం పూలకుంట సమీపంలో ప్రమాదానికి గురయ్యారు. గాయపడిన వీరిని మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం



హోమం చేస్తున్న వేదపండితులు

**బొమ్మనహాళ్:** మండలంలోని శ్రీరంగాపురం క్యాంపు గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రెండోరోజు పూజలు జరిగాయి. అర్చకులు పూజలు చేశారు. ఆలయ సన్నిధిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### ఆంజనేయస్వామి రథోత్సవం

**గుమ్మఘట్ట:** మండలంలోని ఆర్.కొత్తపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి రథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో స్వామికి ఆకు పూజ,కుంకుమార్చన, పుష్పాలంకరణ, పంచామృతాభిషేకం, మహా మంగళారతి తదితర పూజలు నిర్వహించారు. స్వామి ఉత్సవ విగ్రహాన్ని అడ్డపల్లకీలో తీసుకొచ్చి అలంకరించిన రథంలో కొలువుదీర్చి గ్రామంలో పురవీధుల్లో ఊరేగించారు.

### పగలే వెలుగుతున్న వీధిలైట్లు



ఎక్సైజ్‌స్టేషన్ వీధిలో పట్టపగలే వెలుగుతున్న వీధిలైటు

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని కొన్ని వీధులతోపాటు శివారు కాలనీల్లో వీధిలైట్లు పగలే వెలుగుతున్నాయి. లైట్లు నిరంతరాయంగా వెలుగుతున్నా మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు పట్టించుకోవడంలేదు. ఇప్పటికే రూ.లక్షల్లో విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయి. దీనిపై ఇంజనీరింగ్ విభాగం అధికారులను అడిగితే కొన్ని చోట్ల థర్డ్ లైన్ లేక, సమస్య వస్తోందన్నారు. థర్డ్ లైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని ఏఈ ప్రతాప్ తెలిపారు.